సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం ၊ 28 ၊ నవంబర్ ၊ 2023



సోమశిలలో 29.382 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 29.382 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 153 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.63,930
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,747
3శాతం జీఎస్టీతో	రూ.5,919
నవర (8గ్రా)	రూ.47,352

గరిష్టం/కనిష్టం
29.0 /25.5

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 92 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా వర్షం కురిసింది. మంగళవారం కూడా జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

నేడు స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు(పొగతోట): జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 28వ తేదీన స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం వరకు జరుగుతాయని తెలిపారు. స్థాయీ సంఘ సమావేశాలకు సభ్యులు, ఆయా శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

నేటి నుంచి సమ్మేటివ్‌-1 పరీక్షలు

నెల్లూరు(టౌన్): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో మంగళవారం నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు సమ్మేటివ్–1 పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 6, 8, 10 తరగతుల విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు, 7, 9 తరగతులకు మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు 80 మార్కులకు, 9, 10 తరగతులకు 100 మార్కులకు ప్రశ్నపత్రాలు ఇవ్వనున్నారు.

ఇన్‌చార్జి డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైమ్): గుంతకల్ రైల్వే డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ నెల్లూరు రైల్వే ఇన్‌చార్జి డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు రైల్వే డీఎస్పీగా పనిచేస్తున్న పి.మల్లికార్జునరావు ఇటీవల డీజీపీ కార్యాలయానికి బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తొలుత తిరుపతి డీఎస్పీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే వివిధ కారణాల నేపథ్యంలో ఆ ఉత్తర్వులను రద్దు చేసి గుంతకల్ రైల్వే డీఎస్పీకి బాధ్యతలు అప్పగించారు. సోమవారం మల్లికార్జునరావు తన విధుల నుంచి రిలీవ్ కాగా అబ్దుల్ అజీజ్ బాధ్యతలు స్వీకరించారు.

పేదల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



మహిళకు ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కార్డు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ

వెంకటాచలం: పేదల ఆరోగ్య భద్రతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తెలిపారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా వెంకటాచలం మండలం తిక్కవరప్పాడు గ్రామ సచివాలయం వద్ద సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ ప్రజలకు ఆయుష్మాన్‌భారత్ ప్రధానమంత్రి జన్ యోజన కార్డులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ కార్డు ద్వారా సంవత్సరానికి రూ.5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య సేవలు పొందవచ్చని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారు కూడా ఈ కార్డు ద్వారా వైద్యసేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ముజీబున్నీసా, కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రవల్లిక, ఏపీ రోడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నలగర్ల భారతి, సర్పంచ్ చిరంజీవి, కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో టీటీడీ చైర్మన్



టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డికి శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అర్చకులు

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో వెలసిన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామిని తిరుపతి తిరుమల దేవస్థానం చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిత్య కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేసి వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, దేవ స్థానం సిబ్బంది పాల్గొన్నారు.

కరెంటు కష్టాల్లేవ్



రాష్ట్ర ప్రభుత్వం కర్షకులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. గతంలో రైతులు పడిన కరెంటు కష్టాలకు చెక్ పెడుతూ పగటి పూటే నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేస్తుండడంతో మోటార్ల ద్వారా పంటలకు సరిపడా నీరు అందించేందుకు వీలవుతోంది. తద్వారా రైతులు అధిక దిగుబడులు పొంది ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

జిల్లా రైతులకు నాణ్యమైన విద్యుత్

- పగటిపూట 9 గంటలు నిరాటంకంగా సరఫరా
- ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే గంటల వ్యవధిలోనే మార్పు
- దరఖాస్తు చేసుకున్నాక నిర్ణీత గడువు లోపే కనెక్షన్ మంజూరు
- రాత్రి సమయంలో పొలాల వద్ద కరెంట్ కోసం జాగరణకు స్వస్తి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): గత నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా రైతులకు ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ అధికారులు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నారు. పగలు నిరాటంకంగా 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తూ రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. అన్నదాతలకు అందిస్తున్న ఉచిత విద్యుత్ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుండడంతో వారు ఎలాంటి ఖర్చు లేకుండా, విద్యుత్ కోతలు లేకుండా సంతోషంగా పంటలు సాగు చేసుకుంటున్నారు. జిల్లాలో 2,16,732 వ్యవసాయ విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. ఏపీఎస్పీడీసీఎల్ వీరందరికీ పగటిపూట 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తోంది. ఈ ఏడాదిలో 3,030 మంది రైతులకు కొత్తగా వ్యవసాయ విద్యుత్ సర్వీసులను అందజేసింది. మరో 945 మంది రైతులకు వ్యవసాయ విద్యుత్ సర్వీసులు అందజేయాల్సి ఉంది.

గతంలో ఇలా..

గత ప్రభుత్వంలో రైతులకు అందజేసే విద్యుత్ రాత్రి సమయాల్లో, అది కూడా ఒక నిర్ణీత సమయంలో కాకుండా ఇష్టం వచ్చిన సమయంలో సరఫరా చేసేవారు. అంతేకాక 7 గంటలు మాత్రమే ఇచ్చే కరెంట్‌ను రెండుసార్లుగా ఇచ్చేవారు. దీంతో విద్యుత్ ఏ సమయంలో ఇస్తారో తెలిసేది కాదు. రైతులు పంట పొలాల్లో మోటార్ల వద్ద కరెంటు ఎప్పుడొస్తుందోనని పడిగాపులు కాయాల్సివచ్చేది. చివరకు రాత్రి భోజనం కూడా పొలానికి తీసుకెళ్లి అక్కడే తిని కరెంట్ వచ్చినప్పుడు మోటార్లు ఆన్ చేసి తిరిగి తెల్లవారుజామున ఇళ్లకు వెళ్లే పరిస్థితి ఉండేది. పలువురు రైతులు రాత్రి సమయాల్లో విషసర్పాల బారిన పడి మృత్యువాత పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నలుగురు, ఐదుగురు రైతులకు కలిసి ఒక విద్యుత్ కనెక్షన్ ఇచ్చి ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేవారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడ్ పడి తరచూ మరమ్మతులకు గురయ్యేవి. వాటికి రిపేర్లు చేయాలంటే వారం నుంచి 10 రోజుల సమయం పట్టేది. ఈ సమయంలో పంటకు నీరందక ఎండిపోయి రైతాంగం తీవ్రనష్టాలు చవిచూసేవారు. అప్పుల ఊబిలో చిక్కుకునేవారు.

అధిక లోడ్ సమస్యలకు స్వస్తి

ప్రస్తుత ప్రభుత్వం ఒక వ్యవసాయ విద్యుత్ సర్వీసుకు 25 కేవీ సామర్థ్యం కలిగిన ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో అధిక లోడ్ సమస్యలు తలెత్తడం లేదు. ఒకవేళ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే గంటల వ్యవధిలోనే మరమ్మతులు చేయడం కానీ, మరొక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం కానీ చేస్తున్నారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల కోసం వినియోగించే విద్యుత్ లైన్లను ఆధునీకీకరించడం, నూతన విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయడంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్, వాటి బ్రేకర్లకు 25 సంవత్సరాల వారంటీ ఉండేలా చర్యలు తీసుకుంటుండడంతో ఎలాంటి మరమ్మతులకు గురయ్యే అవకాశాలు చాలా అరుదుగా జరుగుతున్నాయి. విద్యుత్ కష్టాలకు చెక్ పెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో విద్యుత్‌శాఖ అధికారులు పగటిపూట నిరాటంకంగా 9 గంటలు నాణ్యమైన, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. తద్వారా రైతులు తమ పొలాలకు సకాలంలో నీరు అందించి అధిక దిగుబడులు పొంది ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

రైతులు ఇబ్బందులు పడకూడదు



జిల్లా సర్కిల్ పరిధిలో ఉన్న లక్షలాది మంది రైతులు విద్యుత్ కోసం ఎలాంటి ఇబ్బందులు పడకుండా రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాలివ్వడంతో పగటి సమయంలో 9 గంటలు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. వ్యవసాయ సర్వీసులకు వినియోగించే ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే 36 గంటల్లోనే వాటిని రిపేరు చేస్తున్నాం. లేకపోతే మరొకటి ఏర్పాటు చేస్తున్నాం.

– వి.విజయన్, ఎస్‌ఈ, ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్

నిరాటంకంగా విద్యుత్



నేను గత 40 ఏళ్లుగా నిమ్మ, పత్తి, మిరప పంటలను పండిస్తున్నాను. గతంలో కరెంట్ సమస్యలు ఎక్కువగా ఉండేవి. రోజుకు 7 గంటలు అది కూడా రెండు విడతల్లో ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం 9 గంటలు పగటిపూట కరెంట్ ఇస్తున్నారు. దీంతో పంటల సాగుకు అనుకూలంగా ఉంది.

– ఎదుళ్ల శ్రీనివాసులు, రైతు, డీసీపల్లి, మర్రిపాడు మండలం

రాత్రి జాగరణలు పోయాయి



గత 43 ఏళ్లుగా వరి పంట సాగు చేస్తున్నాను. గతంలో ఏ సమయంలో కరెంట్ వస్తుందో తెలిసేది కాదు. దీంతో రాత్రి 7 గంటల నుంచి తెల్లవారే దాకా పొలాల్లోనే మోటార్ల వద్ద జాగరణ చేసేవాడిని. కానీ ప్రస్తుతం పగటిపూట 9 గంటలు కరెంట్ ఇస్తుండడంతో పంటలకు సరిపడా నీరు అందుతోంది.

– హరిరెడ్డి, రైతు, పడుగుపాడు, కోవూరు మండలం

అర్జీలకు సత్వర పరిష్కారం చూపండి

- జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్



స్పందనలో అర్జీదారుల సమస్యను తెలుసుకుంటున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన అర్జీలను నిశితంగా పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నిర్దిష్ట గడువు లోపు అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టి అర్జీలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. వచ్చిన అర్జీలు మళ్లీ మళ్లీ వస్తుంటే దరఖాస్తుదారుడి వద్దకు వెళ్లి సమస్య ఎందుకు పరిష్కారం కావడం లేదో అర్థమయ్యేలా వివరించాలని తెలిపారు. కొండాపురం మండలం చింతలదీవిలో ఉన్న జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రంలో ఉన్న పశువులకు మేత కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర ప్రముఖ్ మిడతల రమేష్ వినతిపత్రం అందజేశారు. 2021, 2022 సంవత్సరాలకు సంబంధించి రైతులకు ఇవ్వాల్సిన హమాలి, ట్రాన్స్‌పోర్ట్ చార్జీల నగదును ఇప్పించాలంటూ మాతురు శ్రీనివాసులురెడ్డి, కేతు వెంకటరమణారెడ్డి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నుడా వీసీ బాపిరెడి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మిత, హౌసింగ్, మెప్మా పీడీలు నాగరాజు, రవీంద్ర, బీసీ, ఎస్సీ, మైనారిటీ వెల్ఫేర్ అధికారులు వెంకటయ్య, పరిమళ, నిర్మలాదేవి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

డిసెంబర్ 15 నుంచి 'ఆడుదాం ఆంధ్రా'

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 15 నుంచి 2024 ఫిబ్రవరి 3వ తేదీ వరకు 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలు నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్, ఆడుదాం ఆంధ్రా క్రీడల నోడల్ అధికారి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్, ఆడుదాం ఆంధ్రా క్రీడల అడిషనల్ నోడల్ అధికారి వికాస్‌మర్మత్, అసిస్టెంట్ కలెక్టర్ సంజనాసిన్హాలతో కలిసి జేసీ కూర్మనాథ్ ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలకు సంబంధించి రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించేలా డిసెంబర్ 15 నుంచి 2024 ఫిబ్రవరి 3వ తేదీ వరకు ఎంపిక చేసిన క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడా అంశాలతోపాటు యోగా, టెన్నికాయిట్, మారథాన్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, ట్రోఫీలు, పతకాలు అందజేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడా జట్లకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కమిషనర్ వికాస్‌మర్మత్ మాట్లాడుతూ 'ఆడుదాం ఆంధ్రా' టోర్నమెంట్‌కు సంబంధించి క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 27వ తేదీ నుంచి మొదలైందని, ఔత్సాహికులు ఆన్‌లైన్‌లో, 1902 నంబరుకు కాల్ చేసి, గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుగంగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి.బాపిరెడ్డి, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, సెట్నల్ సీఈఓ నాగరాజకుమారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, టీపీఆర్‌ఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు విషమిచ్చి తల్లి ఆత్మహత్య!





వాణి, హరిమోక్షిక మృతదేహాలు

నెల్లూరు(క్రైమ్): దంపతుల నడుమ విభేదాలో.. మరే ఇతర కారణమో స్పష్టంగా తెలియదు కానీ ఓ తల్లి తన మూడేళ్ల కుమార్తెకు విషమిచ్చి ఆత్మహత్య చేసుకుంది. ఈ హృదయ విదారక ఘటన నగరంలోని నేతాజీనగర్ ఎనిమిదో వీధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. వెంకటాచలం మండలం కురిచెర్లపాడుకు చెందిన ఎం.గోవర్ధన్, ప్రగతినగర్(సారాయంగడి సెంటర్)కు చెందిన వాణి(28) డిగ్రీ చదువుకునే సమయంలో ప్రేమలో పడ్డారు. ఇద్దరి కులాలు వేరుకావడంతో గోవర్ధన్ తల్లిదండ్రులు వారి ప్రేమను అంగీకరించలేదు. వాణి తల్లిదండ్రులు సముఖం వ్యక్తం చేశారు. దీంతో 2018లో గోవర్ధన్ – వాణి వివాహం చేసుకున్నారు. గోవర్ధన్ రామలింగాపురం సమీపంలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో లోన్ సెక్షన్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వారికి కుమార్తె హరిమోక్షిక(3) ఉంది. సుమారు రెండు నెలలుగా వారు నేతాజీనగర్ ఎనిమిదో వీధిలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం ఎప్పటిలాగే ఉదయం 9.30 గంటలకు గోవర్ధన్ ఉద్యోగానికి వెళ్లారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో అతని మామ సుధాకర్(వాణి తండ్రి) ఫోన్ చేసి వాణి ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని చెప్పారు. గోవర్ధన్ భార్యకు ఫోన్ చేసినా ఫలితం లేకుండాపోయింది. దీంతో వాణి తల్లిదండ్రులు, గోవర్ధన్ హుటాహుటిన ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులు తెరిచే ప్రయత్నం చేయగా లోపలి నుంచి గడియపెట్టి ఉండడంతో గట్టిగా తోయగా తలుపు తెరుచుకుంది. లోనికి వెళ్లి చూడగా వాణి ఫ్యానుకు చీరతో ఉరేసుకుని ఉండగా, చిన్నారి బెడ్‌పై మృతిచెంది ఉంది. ఈ ఘటనపై కుటుంబసభ్యులు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ, ఎస్సై అంకమ్మ, ట్రైనీ డీఎస్పీ హేమలత ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వాణి ఆత్మహత్యకు గల కారణాలపై భర్తను విచారించగా తాము ఎంతో అన్యోన్యంగా ఉండేవారమని చెప్పాడు. చుట్టుపక్కల వారిని విచారించినా వారు అదే విషయాన్ని తెలియజేశారు. చిన్నారి మృతదేహం పక్కన పాలగిన్నె ఉండడం అందులో ఏదో కలిపినట్లు ఉండడంతో వాణి తొలుత చిన్నారిని చంపి ఆపై ఆమె ఆత్మహత్య చేసుకుని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. అన్యోన్యంగా ఉంటే ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏమై ఉంటుందని పోలీసులు ఆరా తీస్తున్నారు. తల్లి, కుమార్తెల మృతి విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను చూసి చలించిపోయారు. గోవర్ధన్ వల్లనే తమ కుమార్తె చనిపోయిందని మృతురాలి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ఉద్యోగం పేరిట రోజుల తరబడి ఇంటికి వచ్చేవాడు కాదని, ఇంట్లో డబ్బులు సైతం ఇచ్చేవాడు కాదని, వాణి బంగారు నగలు అన్నీ కుదువపెట్టాడని వారు ఆరోపించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారించి తగిన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు. పోలీసులు భర్తను అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. మృతదేహాలను జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లాభసాటిగా ప్రకృతి వ్యవసాయం

- ఏడాది పొడవునా పంటలు
- సూర్యమండలం (కిచెన్ గార్డెన్) ప్రణాళికలు
- 0.20 సెంట్ల భూమిలో పలు రకాల పంటలు
- ఎస్‌హెచ్‌జీ మహిళల ఆధ్వర్యంలో సాగు
- ప్రతి మండలంలో ఆర్గానిక్ మార్కెట్లు



నెల్లూరు(పొగతోట): ప్రకృతి వ్యవసాయంతో ప్రజలకు ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. రసాయనాలు లేకుండా పంటలు పండించి ప్రజలకు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించాయి. స్వయం సహాయక గ్రూపుల(ఎస్‌హెచ్‌జీ) మహిళల ద్వారా ప్రకృతి వ్యవసాయం చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 0.20 సెంట్ల భూమిలో 365 రోజులు కూరగాయలు, పండ్లు దిగుబడి వచ్చేలా చర్యలు చేపడుతున్నారు. దీనిపై ఎస్‌హెచ్‌జీలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం ప్రతి మండలంలో 10 కిచెన్ గార్డెన్స్(సూర్య మండలాలు) ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. ప్రస్తుతం రసాయనాలతో పండించిన పంటలు అధికశాతం మంది ప్రజలు వినియోగిస్తున్నారు. రసాయనాలతో పండించిన పంటలు, పండ్లు తినడం వలన ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఆస్పత్రులకు వేలకు వేలు ఖర్చు పెట్టాల్సివస్తోంది. 30 సంవత్సరాల క్రితం షుగర్, థైరాయిడ్, గుండె, కాలేయం తదితర వ్యాధులు ఎక్కడో ఒకరికో ఇద్దరికో ఉండేవి. రసాయనాలతో పండిన పంటలు వినియోగించడం, వాతావరణం, నీరు కలుషితం కావడం వలన ప్రజలు అధిక శాతం మంది షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో సుమారు నాలుగు దశాబ్దాల క్రితం పంటల సాగు ఏవిధంగా చేశారో ఆవైపు అడుగులు పడుతున్నాయి.

ప్రకృతి సాగుకు ప్రాధాన్యం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇప్పటికే అనేక మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల(ఎస్‌హెచ్‌జీ) ద్వారా ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలోని 37 మండలాల్లో ప్రకృతి వ్యవసాయం విధానంలో పంటల సాగుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 4 లక్షల మందికి పైగా మహిళలు స్వయం సహాయక గ్రూపుల్లో సభ్యులుగా ఉన్నారు. మహిళలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయంపై అధికారులు మహిళలకు అవగాహన కల్పించి సాగు చేయించేలా చర్యలు చేపట్టారు. ప్రతి మండలం నుంచి 10 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలను ఎంపిక చేయనున్నారు. 0.20 సెంట్ల భూమి ఉండి ప్రకృతి వ్యవసాయంపై ఉత్సాహం చూపే మహిళలను ఎంపిక చేయనున్నారు. ఎంపిక చేసిన మహిళలను ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ప్రాంతాలకు తీసుకెళ్లి పంటల సాగుపై అవగాహన కల్పించనున్నారు. 0.20 సెంట్ల భూమిలోనే కిచెన్ గార్డెన్ (సూర్య మండలం)ను ఏర్పాటు చేయనున్నారు. 365 రోజులు పంటలు పండించేలా ప్రణాళికలు రూపొందించారు. ఏకాలంలో ఎలాంటి కూరగాయలు పండించవచ్చు, ఎలాంటి పండ్లు పండుతాయి తదితర అంశాలపై మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించనున్నారు. ప్రకృతి వ్యవసాయం సాగుకు అవసరమైన రుణాలు బ్యాంకుల నుంచి మంజూరు చేయించేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. తద్వారా ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఆదాయం చేకూరేలా చర్యలు చేపడుతున్నారు. అలాగే ప్రతి మండలంలో ఆర్గానిక్ మార్కెట్లను ఏర్పాటు చేయనున్నారు. ఎస్‌హెచ్‌జీ మహిళలు పండించిన పంటలను ఆయా మార్కెట్లకు తరలించి ప్రజలకు విక్రయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఎస్‌హెచ్‌జీ మహిళలకు పంటల సాగు సమయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటిని పరిష్కరించేందుకు ప్రతి మండలంలో సిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నారు.

ప్రకృతి సాగుపై దృష్టి



ప్రకృతి వ్యవసాయం సాగుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. ఎస్‌హెచ్‌జీల ద్వారా కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసి 365 రోజులు పంటలు సాగు చేసేలా చర్యలు తీసుకుంటున్నాయి. 0.20 సెంట్ల భూమిలో అన్ని రకాల కూరగాయలు పండించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనిపై ఎంపిక చేసిన మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించనున్నాం. తద్వారా ప్రజలకు ఆరోగ్యంతోపాటు ఎస్‌హెచ్‌జీ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందనున్నారు.

– సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

'విధి వంచిత'కు రూ.50 వేల ఆర్థికసాయం



బాధితురాలు పద్మ కుటుంబానికి ఎన్‌ఎస్‌ఆర్ ట్రస్ట్ ద్వారా నగదు అందజేస్తున్న ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరురూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి మూడేళ్లుగా మంచానికే పరిమితమైన ఆత్మకూరు మండలం బట్టేపాడుకు చెందిన కట్టా పద్మ దీనస్థితిపై సోమవారం 'సాక్షి' దినపత్రికలో 'విధి వంచిత' శీర్షికన ప్రచురితమైన కథనానికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తక్షణం స్పందించి ఆర్థికసాయం అందజేశారు. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి బట్టేపాడులోని బాధితురాలి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులకు రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. కూలి పనులకు వెళ్తే గానీ పూటగడవని పరిస్థితుల్లో పద్మ మంచానికే పరిమితం కాగా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆర్థికసాయం అందించడం పట్ల ఆ కుటుంబ యజమాని కట్టా పెంచలయ్య, వారి ముగ్గురు పిల్లలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చెరుకూరి చిన్న చెంచయ్య, సొసైటీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.







అడవి అందాలు

అరుదైన వృక్షాలు..పొదల నుంచి వచ్చే పిల్ల గాలులు..పక్షుల కిలకిల రావాలు.. వన్యప్రాణుల అరుపులు..పర్యావరణ అందాల మధ్యన కనీసం ఒక్కరోజైనా గడపాలని ప్రతిఒక్కరికీ ఉంటుంది. ఈ కోరిక తీరాలంటే అడవిలోకి వెళ్లాల్సిందే. అయితే అందరికీ ఈ అవకాశం ఉండదు. అలాంటి అవకాశాన్ని నెల్లూరు నగరవాసుల చెంతకు తీసుకొస్తోంది అటవీశాఖ. నెల్లూరు రూరల్ పరిధిలోని కొత్తూరు సమీపంలో నగర వనాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతోంది. అందులో ఏర్పాటు చేసిన వివిధ రకాల జంతువులు, పక్షుల ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.92
లేయర్	రూ.100
బ్రాయిలర్ చికెన్:	రూ.170
స్కిన్‌లెస్ చికెన్:	రూ.190
లేయర్ చికెన్:	రూ.170

నేడు రెండు విద్యుత్ ఉపకేంద్రాల ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్
- సుమారు లక్ష మందికిపైగా వినియోగదారులకు ప్రయోజనం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు : వ్యవసాయ, పరిశ్రమలు, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను నిరంతరాయంగా అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో వెంకటాచలం మండలం గొలగమూడి సమీపంలో రూ. 48.07 కోట్ల వ్యయంతో, కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఇందుకూరుపేట మండలం కొరుటూరులో రూ.32.98 కోట్ల వ్యయంతో నూతనంగా 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలను నిర్మించింది. ఈ కేంద్రాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించి వినియోగదారులకు అంకితం చేయనున్నారు.

గొలగమూడి ఉపకేంద్రం ప్రయోజనాలు

నెల్లూరు పట్టణం, నెల్లూరు రూరల్, వెంకటాచలం మండలాల పరిధిలోని గ్రామాల్లో ఉన్న పరిశ్రమలు, ఆక్వా, వ్యవసాయం సర్వీసులు, గృహ అవసరాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించడం, భవిష్యత్ పారిశ్రామిక విద్యుత్ అవసరాలను అధిగమించేందుకు ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ సంస్థ గొలగమూడి సమీపంలోని కల్లూరుపల్లి వద్ద విద్యుత్ ఉపకేంద్రాన్ని నిర్మించింది. ఈ కేంద్రంలో 2/31.5 ఎంవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసింది. మనుబోలు విద్యుత్ ఉపకేంద్రం నుంచి 132 కేవీ లైన్‌ను గొలగమూడి విద్యుత్‌ఉపకేంద్రానికి అనుసంధానించారు. ఈ విద్యుత్ ఉపకేంద్రం నుంచి కొండాయపాళెం, గోమతినగర్, ఇస్కపాళెం, కనుపర్తిపాడు ఇండస్ట్రీయల్ ఫీడర్ల ద్వారా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ లభించనుంది. వ్యవసాయానికి పగటి పూటే 9 గంటల విద్యుత్ అందించే సౌలభ్యం కలగనుంది.



కొరుటూరు విద్యుత్ ఉపకేంద్రం



గొలగమూడి విద్యుత్ ఉప కేంద్రం

కొరుటూరు ఉపవిద్యుత్ కేంద్రం ప్రయోజనాలు

ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు మండలాల పరిధిలోని గ్రామాలతో పాటు తీరం వెంబడి విస్తరించి ఉన్న వ్యవసాయ, ఆక్వా, పారిశ్రామిక రంగ అవసరాలతో పాటు గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ సంస్థ కొరుటూరులో విద్యుత్ ఉపకేంద్రాన్ని నిర్మించింది. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ కేంద్రం ప్రజలకు అందుబాటులోకి రానున్నది. ఈ కేంద్రంలో 1/31.5 ఎంవీఏ ప్లస్ 1/16 ఎంవీఏ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. కల్లూరుపల్లి విద్యుత్ ఉపకేంద్రం నుంచి కొరుటూరు విద్యుత్ ఉపకేంద్రానికి 132 కేవీ లైన్‌ను అనుసంధానించారు. ఈ ఉపకేంద్రం నిర్మాణంతో ఇందుకూరుపేట, టీపీగూడూరు మండలాల పరిధిలోని కొత్తూరు, ఇందుకూరుపేట, నరసాపురం, కోడూరు, సౌత్ ఆములూరు, పొట్లపూడి, జగదేవిపేట, లేబూరు, కొమరిక, గంగపట్నం గ్రామాలకు చెందిన వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందనుంది.

ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన



గొలగమూడి విద్యుత్‌ఉపకేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్

గొలగమూడిలో విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభోత్సవ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ సోమవారం పరిశీలించారు. మధ్యాహ్నం సబ్‌స్టేషన్ వద్దకు చేరుకున్న జేసీ సభాస్థలం వద్ద వేదిక, ఎల్‌ఈడీ స్క్రీన్ల ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. జేసీ వెంట ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రీనివాసులు, విద్యుత్ శాఖ ఈఈ రఘునందన్‌రావు, ఏడీఈ సురేష్, ఏఈ మహేంద్రరెడ్డి ఉన్నారు.

తండ్రి మందలించాడని కుమారుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు...దగదర్తి మండలం యలమంచిపాడులో రామమోహన్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన కుమారుడు పెంచలబాబు(22) బీటెక్ చదివాడు.బ్యాక్‌లాగ్ సబ్జెక్ట్‌లు ఉన్నాయి. ప్రస్తుతం ఆయన నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఈ నెల 24న పెంచలబాబు ఇంట్లో నుంచి బయటకు వస్తుండగా తండ్రి ఆపారు. బ్యాక్‌లాగ్ సబ్జెక్ట్‌లు పూర్తిచేస్తే మంచి ఉద్యోగం వస్తుందని మందలించాడు. దీంతో పెంచలబాబు మనస్తాపానికి గురయ్యాడు. నెల్లూరుకు చేరుకుని గాంధీబొమ్మ సర్కిల్ సమీపంలోని ఎస్‌ఎస్‌ఆర్ లాడ్జీలో గదిని అద్దెకు తీసుకున్నాడు. తన వెంట తెచ్చుకున్న పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం విజయమహల్‌గేటు వద్దకు వెళ్లి తన మామ నరేష్‌కు ఫోన్‌చేసి విషయాన్ని తెలియజేశారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు హుటాహుటిన నెల్లూరుకు చేరుకున్నారు. పెంచలబాబును నగరంలోని రామచంద్రారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పెంచలబాబు సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు మృతుని తండ్రి రామమోహన్ చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సైదులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనవరిలో ఫిషింగ్ హార్బర్ ప్రారంభోత్సవం

- విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన
- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: జిల్లాలోని మత్స్యకారులకు వరప్రదాయిని అయిన బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులను జనవరి నాటికి పూర్తి చేసి తానే వచ్చి ప్రారంభిస్తానని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌ను సోమవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. దగదర్తి ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, జెడ్పీటీసీ స్వరూపారాణితో పాటు సీఎంను కలిసిన ఎమ్మెల్యే కావలి నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు చేపడుతున్న సబ్ కాంట్రాక్టర్ టీడీపీలోకి వెళ్లిపోతూ నిర్మాణ పనులు నిలిపేశారని విన్నవించారు. స్పందించిన సీఎం జగన్ ఫిషింగ్ హార్బర్ ప్రధాన కాంట్రాక్టర్‌తో మాట్లాడి మిగిలిన పనులను జనవరి కల్లా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దగదర్తి ఎంపీపీ తాళ్లూరు దామవరం విమానాశ్రయ నిర్మాణ విషయాన్ని వివరించగా జనవరిలో ఫిషింగ్ హార్బర్ ప్రారంభోత్సవానికి కావలికి వస్తానని, అప్పుడే దామవరంలో విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తానని సీఎం తెలిపారు. ఈ మేరకు చర్యలు తీసుకోమని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. అనంతరం కావలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు కోర్టుల్లో కేసులు వేసి దగదర్తి మండలంలోని 13 గ్రామాల్లో జగనన్న కాలనీల పనులను అడ్డుకుంటున్నారని సీఎంకు విన్నవించగా సీఎం స్పందించారు. కోర్టు కేసులు నుంచి విముక్తి కల్పించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని టీడీపీ నాయకులు అడ్డుకుంటున్న విషయాన్ని ప్రజలకు చెప్పాలని సూచించారు. అనంతరం కావలి–తుమ్మలపెంట రోడ్డు నిర్మాణ విషయాన్ని ఎమ్మెల్యే విన్నవించగా, త్వరితగతిన పనులు ప్రారంభించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని సీఎం చెప్పారు. కావలిలో ట్రంక్ రోడ్డు విస్తరణ పనుల్లో చోటు చేసుకుంటున్న జాప్యాన్ని సీఎంకు వివరించగా పనులు వేగవంతం చేసేలా ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. కావలి నియోజకవర్గ సమస్యలపై సానుకూలంగా స్పందించిన సీఎం వైఎస్ జగన్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

నిమ్మధరలు : పొదలకూరు (కిలో)




పెద్దవి:	రూ. 45
సన్నవి:	రూ. 25
పండ్లు:	రూ. 8

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

–ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 85 మంది హాజరయ్యారు. తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీ, ఏఎస్పీలకు అందజేశారు. వాటిని పరిశీలించిన వారు సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో నేరుగా మాట్లాడి చట్టపరిధిలో వినతులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లోన్ యాప్‌లు, నకిలీ అకౌంట్లు, హనీ ట్రాప్, ఏఈపీఎస్, ఉద్యోగాలు, తదితరాల పేరిట సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రేమిస్తున్నామని, పెళ్లి చేసుకుంటామని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న వారిని నమ్మి భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని సూచించారు. ప్రేమిస్తున్నామని వంచించేవారిపై పోలీసు అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు. రైతులను దగా చేసే దళారులపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లల భవిష్యత్ దృష్ట్యా వివిధ కారణాలతో విడిపోయిన తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారి కాపురాలను చక్కదిద్దేందుకు చొరవ చూపాలన్నారు. స్పందన వినతులను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. సైబర్ నేరాలు, మత్తు , మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు డీ హిమవతి, ప్రసాద్, డీటీసీ, ట్రెయినీ డీఎస్పీలు శిరీష, హేమలత, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బాధితురాలి సమస్యను వింటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి